## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్


మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీనివాస్

నిడమనూరు, నవంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా అందుకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఏర్పాట్లను పర్యవేక్షించి మాట్లాడారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద బారికేడ్లు, హెల్ప్‌డెస్క్, సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు వంటి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో వాహనాలు నిలిపివేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళి అమలయ్యేలా చేస్తున్నామని చెప్పారు. పోతునూరు, పులిమామిడి, త్రిపురారం వద్ద ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలూ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నామినేషన్ల సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుకు ఆదేశించామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బీఆర్‌ఎస్‌వై త్రిపురారం మండలాధ్యక్షుడిగా కాంతారావునాయక్


కాంతారావునాయక్

త్రిపురారం, నవంబర్2 : బీఆర్‌ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడిగా మండలంలోని లోక్యాతండా గ్రామానికి చెందిన ధనావత్ కాంతారావు నాయక్‌ను నియమించడంతో పాటు గురువారం అతడికి ఎమ్మెల్యే నోముల భగత్ ఉత్తర్వులు అందించారు. యువతను చైతన్య పర్చి రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, పీఏసీఎస్ చైర్మన్ జయరాంనాయక్ పాల్గొన్నారు.

## బీజేపీకి రిక్కల రాజీనామా

**పార్టీ వైఖరి నచ్చకనే బయటికి వెళ్తున్నట్లు వెల్లడి**


విలేకరులతో మాట్లాడుతున్న రిక్కల ఇంద్రసేనారెడ్డి

హాలియా, నవంబర్ 2 : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రిక్కల ఇంద్రసేనారెడ్డి గురువారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించినట్లు తెలిపారు. హాలియాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం కార్యకర్తలు, ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా పనిచేస్తున్నదన్నారు. ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తాను టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. 2018 ఎన్నికల్లో నాగార్జునసాగర్ బీజేపీ అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ వద్ద డబ్బులు తీసుకొని చివరి మూడు రోజుల ఫోన్ స్విచ్ఆఫ్ చేసి ఎన్నికల బరి నుంచి అర్థాంతరంగా నిష్క్రమించిన విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఈటెల రాజేందర్, డాక్టర్ లక్ష్మణ్‌కు వివరించినప్పటికీ మళ్లీ ఆమెకే టికెట్ ఇవ్వడంతో పార్టీ క్యాడరే ఆశ్చర్య పోతున్నారన్నారు. కేవలం డబ్బుల కోసమే ఆమె మళ్లీ అసెంబ్లీ బరిలో నిలబడిందన్నారు. అలాంటి వ్యక్తి తరఫున ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో చులకనై పోతామన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం ఇష్టంలేకనే బీజేపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. బీసీ అయిన బండి సంజయ్‌ను బీజేపీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి కిషన్‌రెడ్డిని నియమించిన పార్టీ అధిష్టానం ఇప్పుడు బీసీనే ముఖ్యమంత్రిని చేస్తానంటే ప్రజలు నమ్మడం లేదన్నారు. కిషన్‌రెడ్డి కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయకుండా, రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయకుండా కాలయాపన చేస్తూ పార్టీని నిర్వీర్యం చేస్తున్నాడని విమర్శించారు. ఎలాంటి క్యాడర్ లేని పవన్ కల్యాణ్‌తో పొత్తు కోసం బీజేపీ నాయకత్వం వెంపర్లాడడం హస్యాస్పదంగా ఉందన్నారు. అందుకే పార్టీ నాయకత్వ వైఖరి నచ్చకనే బీజేపీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. అభిమానులతో చర్చించి రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.

## పీఏపల్లి మండలంలో పోలీస్ కవాతు

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 2 : మండలంలోని పీఏపల్లి, అంగడిపేట, వద్దిపట్ల, చింతలతండా, భీమనపల్లి గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

## ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్‌దే విజయం

- ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్
- కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు


హాలియా : బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, నవంబర్ 2 : కాంగ్రెస్ నాయకులు కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని, అయినా కార్యకర్తలు, ప్రజలు తమ వెంటనే ఉన్నారని, వారు ఎన్నికుట్రలు చేసినా బీఆర్‌ఎస్ విజయాన్ని అడ్డుకోలేరని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన 25 కాంగ్రెస్ కుటుంబాలు గురువారం హాలియాలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలోనే నాగార్జునసాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచితవిద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేవన్నారు. యాసంగిలో రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు పడకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోనికి వస్తే రైతుబంధును రూ.16వేలకు పెంచడంతో పాటు రూ. 400కే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ ఉడ్తూరి మట్టారెడ్డితో పాటు బూరుగు పెద సాంబయ్య, కాశయ్య, చిన సాంగయ్య, మొటమర్రి కొండల్, అంజయ్య, మురళీ వెంకటేశ్వర్లు, ప్రభాకర్, కోటేశ్, రవి, మల్లికార్జున్, శివ, అశోక్, కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్నమల్ల సత్యం, మార్కెట్ డైరెక్టర్ ఉడ్తూరి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రావుల లింగయ్య, పంగ లక్ష్మణ్ యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ బొమ్మిశెట్టి ఆంజనేయులు, కొంగరి రమణయ్య, బూడిద శేఖర్, గార్లపాటి ఎల్లయ్య, ఊర అఖిల్ పాల్గొన్నారు.

### పులిచర్లకు చెందిన 50 కుటుంబాలు..

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన 50 కాంగ్రెస్ కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరాయి. త్రిపురారం మండల కేంద్రంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో వీరబోయిన ఎల్లయ్య, దండుగుల శ్రీనయ్య, రాయల వెంకటయ్య, కొరెక్క శ్రీను, రాయల నాగయ్య, జంగాల అంజయ్య, చిలుముల అనిల్, వీరబోయిన అనిల్, జోడుపల్లి నర్సింహ, కడారి వెంకటయ్య, గుండల హరిబాబు, బక్కితట్ల కొండల్, పంగ వెంకటయ్య, కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమం లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జటావత్ రవినాయక్, పార్టీ రాష్ట్ర నాయకుడు దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగపాక లక్ష్మయ్య, ఉప సర్పంచ్ చిరంజీవి, నాయకులు ఎల్లయ్య, పాపయ్య, అంజి, కొండల్ పాల్గొన్నారు.

## సాగర్ గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురవేద్దాం

- ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

త్రిపురారం, నవంబర్ 2 : సీఎం కేసీఆర్ పాలనలోనే నాగార్జునసాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, మరో మారు సాగర్ గడ్డపై గులాబీ జెండా ఎగురడం ఖాయమని ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. మండలంలోని బడాయిగడ్డతండా మాజీ సర్పంచ్ సైదా ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, నీలాయిగూడెనికి చెందిన పది కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే భగత్‌తో పాటు ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనులకు అండగా ఉంటున్నదన్నారు. పోడు భూములకు పట్టాలు అందించడంతో పాటు వారికి కూడా రైతుబంధు, రైతుబీమా అందేలా చర్యలు తీసుకుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు బహునూతల నరేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయరాంనాయక్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు కలకొండ వెంకటమ్మాసైదయ్య, సుశీల్‌నాయక్, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బాజు జయరాం, సేవా, రేపూరి ఏడుకొండలు, ధనావత్ రవి పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, చిత్రంలో ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

## నేడు హాలియాలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

హాలియా, నవంబర్ 2 : హాలియాలోని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏడీఈ జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియా విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, తమ విద్యుత్ సమస్యలను అధికారులకు తెలుపాలని సూచించారు.

## హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్

- ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు


రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గుర్రంపోడు, నవంబర్ 2 : హత్యారాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. దుబ్బాక బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యయత్నాన్ని ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే దొంగలకు, హంతకులకు తాళం చెవి ఇచ్చినట్లు అవుతుందని.. ప్రజలు ఆలోచించి ఓటేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యక్షుడు వెలుగు రవి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.